తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం.
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
రాజమహేంద్రవరం మంగళవారం 10 నవంబర్ 2026 I



ముప్పు తెచ్చిన 'ఉప్పు' నీరు రైతులను
పూర్తి స్థాయిలో ఆదుకోవాలని ఆందోళన

యు.కొత్తపల్లి, నవంబర్ 9(ప్రభాతవార్త) :అర్నబ్ తుఫాన్ ప్రభావంతో ఉప్పునీరు పొంగి దెబ్బ తిన్న వరిపంట పొలాలకు పూర్తి స్థాయిలో పరిహారం ఇచ్చి రైతులను ఆదుకోవాలంటూ సోమవారం తహశీల్దారు కార్యాలయం వద్ద ఉప్పాడ – పిఠాపురం రోడ్డులో ఆందోళన నిర్వహించారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలంటూ నినాదాలు చేశారు. దీంతో తహశీల్దారు చిన్నారావు, వ్యవసాయాధికారి జోగిరాజు, వినతిపత్రాలను అందజేసారు. రైతులకు జరిగిన నష్టంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్ళడం జరుగుతుందనడంతో ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా బాధిత రైతులు మాట్లాడుతూ మరో పదిహేను ఇరవై రోజుల్లో పంట కోతకు వచ్చి చేతికి అందే సమయంలో గత నెల 27 తేదీ రాత్రి అర్నబ్ తుఫాన్ ప్రభావంతో కెరటాల ధాటికి ఉప్పునీరు పొలాల్లోకి చేరి వరిపంట పూర్తిగా దెబ్బతిని రైతులకు పూర్తి నష్టం వాటిల్లిందని, సుమారు 250 ఎకరాల వరకు వరిపంట చనిపోతే ఏ ఒక్క నాయకుడు వచ్చి పరిశీలించిన పాపాన పోలేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. తమకు జరిగిన నష్టానికి ప్రభుత్వం పూర్తి స్థాయిలో పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.

దీపావళి వేళ భక్తజన సంద్రంగా వాడపల్లి క్షేత్రం!

ఏడు వారాల నోములు ఆచరించి వెంకన్నను దర్శించుకున్న భక్తులు..

నిత్యాన్నదానానికి రూ.1.37 లక్షల విరాళం











ఆత్రేయపురం, నవంబర్ 09 (ప్రభాత వార్త) కోనసీమ తిరుమలగా ప్రసిద్ధిగాంచిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయం ఆదివారం భక్తజన సందోహంతో కిక్కిరిసింది. దీపావళి పర్వదినం, ఆదివారం సెలవు కావడంతో వేలాది మంది భక్తులు స్వామివారి దర్శనానికి తరలివచ్చారు. ఏడు వారాల నోము ఆచరించిన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో అష్టోత్తర శతనామావళి, నిత్య కల్యాణం, గోపూజ, బాలభోగం, నివేదన తదితర కార్యక్రమాలు సంప్రదాయబద్ధంగా జరిగాయి. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని సాయంత్రం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీకృష్ణుడు నరకాసురుడిని సంహరించిన విజయానికి గుర్తుగా నిర్వహించిన వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

నిత్యాన్నదానానికి రూ.1,37,116 విరాళం

ఆలయ నిత్యాన్నదాన పథకానికి ఆలమూరు మండలం జొన్నాడకు చెందిన లంక శ్రీరాములు, మనవరాలు శ్రీ జాహ్నవి, కుటుంబ సభ్యులు రూ.1,01,116, తాడేపల్లిగూడెంకు చెందిన ఏలూరు శ్రీహరిప్రియ కుటుంబ సభ్యులు రూ.36,000 విరాళంగా అందించారు. ఈ సందర్భంగా దాతలకు అర్చకులు వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు, జూనియర్ అసిస్టెంట్ వై. శ్రీనివాస్ స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ అధికారులు దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆకారం చిన్నది... ధర పెద్దది..

పుంగనూరు ఆవు,దూడకు రూ.5.30 లక్షల రికార్డు ధర..



అంబాజీపేట, నవంబర్ 9,(ప్రభాతవార్త): ఉభయ గోదావరి జిల్లాల్లోనే పుంగనూరు ఆవుకు అత్యధిక ధర పలికిందని ఫామ్ నిర్వాహకుడు అడబాల ప్రేమ్ కుమార్ తెలిపారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం మాచవరం గ్రామంలోని ఆధ్యశ్రీ డైరీ ఫామ్‌లో పెంచుతున్న స్వచ్ఛమైన పుంగనూరు జాతి ఆవు-గిత్తదూడ కు రికార్డు స్థాయిలో ధర లభించింది. మద్రాసుకు చెందిన బివిడి లిమిటెడ్ సంస్థ అధినేత ప్రసాద్ ఈ పుంగనూరు ఆవును ఏకంగా రూ.5 లక్షల 30 వేల రూపాయలకు కొనుగోలు చేసినట్లు ఫామ్ నిర్వాహకుడు ప్రేమ్ కుమార్ తెలిపారు. గతంలో తమ ఫామ్ నుంచి నేషనల్ డైరీ డెవలప్మెంట్ బోర్డ్ (ఎన్డీడీబీ) సౌత్ బ్యాంక్‌కు కూడా పుంగనూరు బుల్ (గిత్త)ను అందించినట్లు పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం పలికిన రూ.5.30 లక్షల ధర ఉభయ గోదావరి జిల్లాల్లోనే అత్యధికమని ఆయన తెలిపారు.ఈ ఆవు నూరు శాతానికి పైగా స్వచ్ఛమైన పుంగనూరు జాతి లక్షణాలు కలిగి ఉందని, పూటకు మూడు లీటర్ల పాలు ఇస్తుందని, 36 అంగుళాల ఎత్తుతో పాటు జాతికి సంబంధించిన ప్రత్యేక శరీర నిర్మాణం,మూపురం వంటి లక్షణాలు కలిగి ఉందని వివరించారు. గతంలో ప్రభుత్వాల తరపున నిర్వహించిన పశు-పాడి పరిశ్రమాభివృద్ధి ఎగ్జిబిషన్లలో పాల్గొని ఎన్నో అవార్డులు గెలుచుకున్నామన్నారు.కార్తీక మాసంను పురస్కరించుకుని స్వచ్ఛమైన పాలు,పెరుగు, నెయ్యి కోసం పుంగనూరు ఆవును తమ యజమాని కొనుగోలు చేసినట్లు ఆవును తమిళనాడు తీసుకెళ్లేందుకు వచ్చిన వ్యాపారవేత్త గుమస్తా తెలిపారు.

జీవనశైలి మార్పులతో క్లోమగ్రంథి వ్యాధుల ముప్పు

తొలి దశలో గుర్తిస్తే ప్రాణరక్షణ, డాక్టర్ శ్రీకాంత్



కాకినాడ రూరల్, నవంబరు 9 (ప్రభాత వార్త): మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్ల కారణంగా క్లోమగ్రంథి సంబంధిత వ్యాధుల ముప్పు పెరుగుతోందని, వీటిని ప్రారంభ దశలోనే గుర్తించి సరైన చికిత్స తీసుకుంటే ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చని హైదరాబాద్ యశోద వైద్యశాల జీర్ణకోశ వ్యాధుల నిపుణుడు డాక్టర్ శ్రీకాంత్ సూచించారు. సోమవారం కాకినాడలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆహారం జీర్ణం కావడంలో, రక్తంలో చక్కెర స్థాయిల నియంత్రణలో క్లోమగ్రంథి కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. ఈ గ్రంథి దెబ్బతింటే పోషకాహార లోపం, బరువు తగ్గడం, మధుమేహం వంటి సమస్యలు తలెత్తుతాయని తెలిపారు. కడుపు పైభాగంలో తీవ్రమైన నొప్పి వచ్చి వీపునకు పాకడం, వాంతులు కావడం క్లోమగ్రంథి వాపునకు ప్రధాన లక్షణాలని పేర్కొన్నారు. వీటిని సాధారణ గ్యాస్ సమస్యగా భావించి సొంత వైద్యం చేసుకోవడం ప్రమాదకరమని హెచ్చరించారు. మద్యపానంతో పాటు పిత్తాశయంలో రాళ్లు, రక్తంలో అధిక కొవ్వు నిల్వలు కూడా ఈ వ్యాధికి కారణమవుతాయని స్పష్టం చేశారు. క్లోమగ్రంథి వాపు, ప్రాణాంతక కణితి రెండూ వేర్వేరు సమస్యలని, వాటిని ఒకే విధంగా భావించి భయపడాల్సిన అవసరం లేదన్నారు. ప్రతి రోగికీ శస్త్రచికిత్స అవసరం ఉండదని, ఆధునిక అంతర్దర్శిని వైద్య విధానాల ద్వారా పెద్ద కోతలు లేకుండానే గ్రంథిలో పేరుకుపోయిన చీము, ద్రవాలను తొలగించే సౌకర్యం అందుబాటులో ఉందని వివరించారు. కారణం లేకుండా బరువు తగ్గడం, పచ్చకామెర్లు రావడం, మూత్రం ముదురు రంగులోకి మారడం, ఆకలి మందగించడం, నిరంతర కడుపునొప్పి, కొత్తగా మధుమేహం బయటపడటం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వ్యాధిని తొలిదశలో గుర్తిస్తే శస్త్రచికిత్స, ఇతర ఆధునిక చికిత్సలతో మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు. ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండటంతో పాటు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, క్రమబద్ధమైన జీవనశైలిని పాటించడం ద్వారా జీర్ణకోశ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. వ్యాధి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్యులను సంప్రదించాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వాణిజ్య విభాగ నిర్వాహకుడు కె. సతీష్, ఉన్నత కార్యనిర్వాహకుడు సాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా తీర్పుతో కూటమికి
తిరుగులేని విజయం

ప్రజల ఆదరణకు జీవితాంతం రుణపడి ఉంటా: మంత్రి సుభాష్



రామచంద్రపురం నవంబరు 09 ప్రభాతవార్త: స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు సాధించిన విజయాలు ప్రజల ఆశీర్వాదానికి,ఎన్డీఏ కూటమి ఐక్యతకు నిదర్శనమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు.ప్రజలు తమపై ఉంచిన నమ్మకం,చూపిన ఆదరణ విజయాల రూపంలో ప్రతిఫలించాయని ఈ తీర్పు తమ బాధ్యతను మరింత పెంచిందని పేర్కొన్నారు.ప్రజల ప్రేమాభిమానాలకు జీవితాంతం కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు.ద్రాక్షారామంలోని పేపకాయల బాజ్జి కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన కూటమి విజయోత్సవ ఆత్మీయ వేడుక ఘనంగా జరిగింది.రామచంద్రపురం మున్సిపల్ చైర్మన్ మేడిశెట్టి శేషారావు,నూతన కౌన్సిలర్లు,మూడు మండలాల జడ్పీటీసీలు,ఎంపీటీసీలను మంత్రి సుభాష్,కూటమి సీనియర్ నాయకుడు వాసంశెట్టి సత్యం, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్,జనసేన ఇన్‌ఛార్జి పోలిశెట్టి చంద్రశేఖర్,చిక్కాల దొరబాబు తదితరులు ఘనంగా సత్కరించారు.

వైకాపా ఓటమి.. ప్రజాతీర్పుకు నిదర్శనం

మంత్రి సుభాష్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు సాధించిన విజయాలు నాయకులు,కార్యకర్తల సమష్టి కృషికి నిదర్శనమన్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పు కూటమి ప్రభుత్వంపై ఉన్న విశ్వాసాన్ని చాటిందన్నారు.వైకాపాకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని వ్యాఖ్యానించారు.ఓటమిని జీర్ణించుకోలేక కవ్వింపు చర్యలకు దిగడం సరికాదని,ప్రజాతీర్పును గౌరవించడం నేర్చుకోవాలని హితవు పలికారు.ఎన్నికల్లో వ్యక్తిగత విభేదాలు,పదవుల ఆకాంక్షలను పక్కనపెట్టి కూటమి ధర్మంతో పనిచేయడం వల్లే ఆశించిన ఫలితాలు సాధ్యమయ్యాయన్నారు.ఈ ఐక్యతను క్షేత్రస్థాయిలోనూ కొనసాగిస్తూ రానున్న గ్రామపంచాయతీ ఎన్నికల్లో అధిక స్థానాలను ఏకగ్రీవం చేసుకునే దిశగా కృషి చేయాలని శ్రేణులకు పిలుపునిచ్చారు.కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు విజయంతో సంతృప్తి చెందకుండా ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని మంత్రి సూచించారు.పదవులను అధికారానికి చిహ్నాలుగా కాకుండా ప్రజలకు సేవ చేసే అవకాశంగా భావించాలన్నారు.అన్ని వర్గాలను కలుపుకొని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని చెప్పారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు,అభివృద్ధి ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.

ప్రజల మధ్యే ఉంటా.. అభివృద్ధికి కృషి చేస్తా

రామచంద్రపురం నియోజకవర్గంలో పార్టీలకు అతీతంగా నిరుపేద విద్యార్థులకు విద్యా సహకారం అందిస్తున్నామని,సామాజిక బాధ్యతతో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని సుభాష్ తెలిపారు.ద్రాక్షారామం మార్కెట్ అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచామన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు,ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్,మంత్రి నారా లోకేశ్ నాయకత్వంలో,ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని చెప్పారు.నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని,వారి సమస్యల పరిష్కారం, ప్రాంత అభివృద్ధే తన లక్ష్యమని భరోసా ఇచ్చారు.కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ.. కూటమి నాయకులు,కార్యకర్తలు సమన్వయంతో పనిచేయడం వల్లే సార్వత్రిక ఎన్నికల స్ఫూర్తిని స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కొనసాగించగలిగామన్నారు.ఈ ఐక్యతను మరింత బలోపేతం చేసుకొని ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కోరారు.ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్,జనసేన ఇన్‌ఛార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, చిక్కాల దొరబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలు విశ్వాసం ఉంచి అభ్యర్థులను గెలిపించారని తెలిపారు.మంత్రి సుభాష్,వాసంశెట్టి సత్యం చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలు ప్రజల్లో కూటమిపై నమ్మకాన్ని మరింత పెంచాయని పేర్కొన్నారు.నూతన జడ్పీటీసీలు కూటి శేషారత్నం,రవ్వ సీతామహాలక్ష్మి,టేకుమూడి సుజాత మాట్లాడుతూ.. తమ విజయానికి సహకరించిన మంత్రి సుభాష్, వాసంశెట్టి సత్యం,కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాల్లో భాగస్వాములవుతామని చెప్పారు.కార్యక్రమంలో కాజులూరు ఎంపీపీ అభ్యర్థి చందాల ఆదినారాయణ,గంగవరం ఎంపీపీ అభ్యర్థి చుంద్రు సూర్యకుమారి చౌదరి,రామచంద్రపురం రూరల్ ఎంపీపీ అభ్యర్థి డాక్టర్ మడకా రాంబాబు,కూటమి నాయకులు,మూడు మండలాల టీడీపీ,జనసేన,బీజేపీ నాయకులు,ప్రజాప్రతినిధులు,కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.

ముసలమ్మ తల్లికి తీపి అలంకరణ..



కడియం నవంబర్ 10 ప్రభాతవార్త :- కడియపులంక గ్రామదేవత శ్రీముసలమ్మ అమ్మవారికి ఆదివారం దీపావళి శుభ సందర్భంగా స్వీట్లతో అలంకరణ చేశారు. గ్రామ ప్రజలు, భక్తులు వివిధ రకాల తీపి పదార్థాలను నైవేద్యంగా సమర్పించారు. అమ్మవారికి గత ఏడు సంవత్సరాలుగా దీపావళి రోజు అమ్మవారికి ఇదే విధంగా తీపి అలంకరణ నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపారు. అమ్మవారిని దర్శించడానికి సమీప గ్రామ ప్రజల నుంచి విశేషాలు పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

గ్రామ పంచాయతీ ఎన్నికలకు 12 స్థిర నిఘా బృందాలు

పోలవరం జిల్లాలో మూడు విడతల్లో ఎన్నికలు.. ప్రతి మండలానికి ప్రత్యేక కార్యనిర్వాహక మేజిస్ట్రేట్‌తో బృందం. జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్.



పోలవరం జిల్లా ప్రతినిధి, నవంబర్ 9 ప్రభాత వార్త. పోలవరం జిల్లా వ్యాప్తంగా గ్రామ పంచాయతీ రెండో సాధారణ ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం పటిష్ట చర్యలు చేపట్టింది. అందులో భాగంగా జిల్లాలోని 12 మండలాలకు ఒక్కొక్క ప్రత్యేక కార్యనిర్వాహక మేజిస్ట్రేట్‌తో కూడిన 12 స్థిర నిఘా బృందాలను (ఎస్ఎస్‌టీ) ఏర్పాటు చేస్తూ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. దినేష్ కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం జిల్లాలో మూడు విడతల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్నారు. మొదటి విడతలో నవంబర్ 26న అడ్డతీగల, మారేడుమిల్లి, రాజవొమ్మంగి, వై.రామవరం మండలాల్లో, రెండో విడతలో నవంబర్ 29న దేవీపట్నం, గంగవరం, గుర్తేడు, రంపచోడవరం మండలాల్లో, మూడో విడతలో డిసెంబర్ 2న చింతూరు, కూనవరం, వరరామచంద్రపురం, ఏటపాక మండలాల్లో పోలింగ్ జరగనుంది. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, అప్పీళ్ల పరిష్కారం, ఉపసంహరణ, తుది అభ్యర్థుల జాబితా ప్రకటన వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పోలింగ్ రోజున ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఓటింగ్, మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటించనున్నారు.

అక్రమ నగదు, మద్యం రవాణాపై నిఘా

స్థిర నిఘా బృందాలు ప్రధాన రహదారులు, జిల్లా సరిహద్దుల్లో తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేసి అక్రమ మద్యం, నగదు, బహుమతి వస్తువులు, మత్తు పదార్థాలు, ఆయుధాలు, మందుగుండు సామగ్రి రవాణాపై నిరంతర నిఘా ఉంచుతాయి. ఓటర్లను ప్రలోభపెట్టే వస్తువులతో పాటు సంఘ విద్రోహ శక్తుల కదలికలను కూడా పర్యవేక్షిస్తాయి. ప్రత్యేక కార్యనిర్వాహక మేజిస్ట్రేట్ సమక్షంలోనే తనిఖీలు నిర్వహించాలని, ప్రతి తనిఖీని తేదీ, ప్రదేశం, బృందం వివరాలతో వీడియో చిత్రీకరించి మరుసటి రోజు రిటర్నింగ్ అధికారికి సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. అభ్యర్థులు, వారి ఏజెంట్లు, రాజకీయ పార్టీల కార్యకర్తలకు సంబంధించిన వాహనాల్లో రూ.50 వేల కంటే ఎక్కువ నగదు లేదా రూ.10 వేల కంటే ఎక్కువ విలువైన మద్యం, బహుమతి వస్తువులు, ఇతర నిషేధిత వస్తువులు లభిస్తే నిబంధనల ప్రకారం స్వాధీనం చేసుకోవాలని సూచించారు. అయితే వ్యాపార అవసరాలు, బ్యాంకు లావాదేవీలు, వైద్య చికిత్స, వివాహ కార్యక్రమాల కోసం నగదు తీసుకువెళ్లేవారు తగిన ఆధారాలు చూపితే ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం మినహాయింపులు వర్తిస్తాయని తెలిపారు. తనిఖీల సమయంలో ప్రజల పట్ల అధికారులు మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, మహిళా అధికారిణి సమక్షం లేకుండా మహిళల పర్సులను తనిఖీ చేయరాదని స్పష్టం చేశారు. ఇతర శాఖలు ఏర్పాటు చేసిన తనిఖీ కేంద్రాల వద్ద పునరావృత తనిఖీలు జరగకుండా సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. ప్రతి బృందం రోజువారీ నివేదికలను ఎస్పీ, రిటర్నింగ్ అధికారి, కలెక్టర్, ఎన్నికల పరిశీలకులకు సమర్పించాలి. ఫ్లయింగ్ స్క్వాడ్లు కూడా ఎస్ఎస్‌టీ బృందాల పనితీరును పర్యవేక్షిస్తాయి. పోలింగ్‌కు ముందు చివరి 72 గంటల్లో సున్నిత ప్రాంతాల్లో నిఘాను మరింత పటిష్టం చేయాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల తనిఖీల వీడియో రికార్డుల ప్రతులు కావాలనుకునే ప్రజలు రూ.300 చెల్లించి పొందవచ్చని విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు అన్ని బృందాలు అప్రమత్తంగా విధులు నిర్వహిస్తూ ఎన్నికల నియమావళి ఉల్లంఘనలకు తావులేకుండా చూడాలని కలెక్టర్ కె. దినేష్ కుమార్ ఆదేశించారు.

రెయిన్ బో చిల్డ్రన్స్ హాస్పిటల్ లో
నవజాత శిశువుకి అరుదైన వైద్య చికిత్స



ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,నవంబరు9, ప్రభాతవార్త. రాజమహేంద్రవరం రెయిన్ బో చిల్డ్రన్స్ హాస్పిటల్ లో నవజాత శిశువుకి వైద్యులు అరుదైన వైద్య చికిత్స ను విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రెయిన్బో చిల్డ్రన్స్ హాస్పిటల్ వైద్యులు కన్సల్టెంట్ పీడియాట్రిక్స్ అండ్ నియోనాటాలజీ డాక్టర్ యోగేష్ కె.ఎస్, డాక్టర్ సునీతా నామ్ దేవ్,డాక్టర్ జె. సుభాష్ చక్రవర్తి తెలిపిన వివరాలు ప్రకారం కాకినాడలో సిజేరియస్ శస్త్రచికిత్స ద్వారా పుట్టిన 2.5 కిలోల బరువు పాప, పుట్టిన వెంటనే ఏడ్చినప్పటికీ కొద్దిసేపటికే తీవ్రమైన శ్వాస ఇబ్బందులు తలెత్తగా తొలుత అక్కడ శ్వాస సంబంధిత వైద్య సహాయం అందించినప్పటికీ, పాప ఆరోగ్య పరిస్థితి క్రమంగా క్షీణించటం ఊపిరితిత్తులకు రక్తాన్ని సరఫరా చేసే రక్తనాళాల్లో రక్తపోటు తీవ్రంగా పెరిగినట్లు వైద్యులు గుర్తించారు. దీనినే 'పల్మనరీ హైపర్టెన్షన్' అంటారు. ఈ పరిస్థితి కారణంగా శరీరానికి అవసరమైన ఆక్సిజన్ను అందుకోవడం కష్టమవుతుంది అక్కడి వైద్యులు కార్డియో పల్మనరీ రిసిసిటేషన్ (సీపీఆర్) ద్వారా చికిత్సని అందించి మెరుగైన వైద్య సేవలు కొరకు రాజమండ్రిలోని రెయిన్బో చిల్డ్రన్స్ హాస్పిటల్ నకు పంపటం జరిగినది. ఈ నవజాత శిశువు అత్యవసర వైద్య చికిత్సలో మరో విజయాన్ని రెయిన్బో చిల్డ్రన్స్ హాస్పిటల్ వైద్యులు సాధించారు. పుట్టిన కొద్దిసేపటికే గుండె ఆగిపోవడం తీవ్ర శ్వాసకోశ సమస్యలకు గురైన నెలలు నిండకముందే జన్మించిన పాపకు విజయవంతంగా చికిత్స అందించారు. నవజాత శిశు వైద్య నిపుణుల బృందం అత్యాధునిక శ్వాస చికిత్స విధానమైన హై ఫ్రీక్వెన్సీ ఆసిలేటరీ వెంటిలేషన్ (హెచ్ ఎఫ్ ఓ వీ) ప్రారంభించి, ఊపిరితిత్తుల రక్తనాళాల్లో ఒత్తిడిని తగ్గించి, శరీరానికి మెరుగైన ఆక్సిజన్ సరఫరాకు ఇసిల్ట్ నైట్రిక్ ఆక్సైడ్ చికిత్సను అందించారు. శ్వాస సంబంధిత సమస్యలతో పాటు పాపకు ఇన్ఫెక్షన్, తక్కువ రక్తపోటు, రక్తహీనత, తాత్కాలికంగా మూత్రపిండాల పనితీరు మందగించడం వంటి సమస్యలు ఎదురయ్యాయి. వీటికి తగిన వైద్య చికిత్సలు, రక్త మార్పిడి, నిరంతర పర్యవేక్షణ ద్వారా సమర్థవంతంగా చికిత్స అందించారు. క్రమంగా మూత్రపిండాల పనితీరు మెరుగుపడటంతో పాటు పాప పాలు జీర్ణించుకోవడం, అనంతరం తల్లిపాలు తాగే స్థాయికి చేరుకుంది. పాపకు పది రోజుల పాటు అత్యాధునిక వైద్య చికిత్స అందిస్తూ, నిరంతరం పర్యవేక్షణలో ఉంచారు. దీంతో పాప పూర్తిగా కోలుకుని, ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉండటంతో ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. డిశ్చార్జ్ అయిన నెల రోజుల అనంతరం నిర్వహించిన వైద్య పరీక్షల్లో పాప 800 గ్రాముల బరువు పెరగడంతో పాటు ఎలాంటి ఇతర సమస్యలు లేకుండా ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. ఈ సంఘటన అత్యాధునిక నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ సేవలు అందుబాటులో ఉండటం ఎంత ముఖ్యమో తెలియజేస్తోంది. తద్వారా ప్రాణాపాయ స్థితిలో ఉన్న శిశువులకు సకాలంలో నాణ్యమైన వైద్య చికిత్స అందించే అవకాశం ఉంటుంది" అని తెలిపారు.

కొలిక్కిరాని కూర్చి ఆట...
ఎవరికి దక్కనుందో ఎంపిపి పీఠం?

వి.ఆర్.పురం,నవంబర్9,ప్రభాతవార్త



స్థానిక సంస్థల (జడ్.పి.టి.సి,ఎంపిటిసి) ఎన్నికలు ఈ విడత వి.ఆర్.పురం మండలంలో సరికొత్త రాజకీయాలకు తెరలేపాయి. ఇక్కడ గత మూడు పర్యాయాలుగా స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఎం, టిడిపి పార్టీలు కలిసి పనిచేశాయి. పొత్తులో భాగంగా జడ్.పి.టి. సి గా టిడిపి, ఎంపిపి గా సిపిఎం పార్టీలు సునాయసంగా గెలుచుకొని, కుర్చీలు దక్కించుకొని ప్రజలకు పాలన అందించాయి. 2026 స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ రెండు పార్టీలు కలిసి పనిచేయలేదు. దీంతో ఇక్కడి ప్రధాన రాజకీయ పార్టీలు మూడు వైసిపి, టిడిపి, సిపిఎం పార్టీలు మూడు విడి విడిగా ఒంటరిగానే పోటీ చేశాయి. దీంతో ఫలితాలు అనూహ్యంగా మారాయి. టిడిపి జడ్.పి.టి.సి పదవిని కోల్పోవాల్సి వచ్చింది. వైసిపి తొలిసారిగా జడ్.పి.టి.సి కైవసం చేసుకొని అదికార తెలుగుదేశం పార్టీకి కోలుకోలేని దెబ్బతీసింది. మొత్తం ఇక్కడ 7 ఎంపిటిసి స్థానాలు ఉన్నాయి. ఏ రాజకీయ పార్టీ అయినా ఎంపిపి స్థానం దక్కించుకోవాలంటే, తప్పక 4 ఎంపిటిసి లు గెలవాల్సి ఉంటుంది. అయితే ఏ పార్టీకి ఇక్కడ ఎంపిపి కి కావాల్సిన మెజార్టీ 4 స్థానాలు దక్కలేదు. 3 వైసిపి, 2 సిపిఎం, 1 టిడిపి, 1 జనసేన పార్టీలకు దక్కాయి. దీంతో ఎన్నికలు ముగిసి, ఫలితాలు వెలువడి 4 రోజులు కావస్తున్న, వి.ఆర్.పురం మండలంలో కూర్చి ఆట కొలిక్కిరావటం లేదు. మండల ప్రథమ పౌరుడి స్థానం, ఎంపిపి పీఠం ఎవరికి దక్కనుందో ? అనే ఉత్కంఠ సామాన్య ప్రజల నుండి అన్ని రాజకీయ పార్టీల నేతల్లోను ఆలోచన రేకిస్తుంది.

వి.ఆర్.పురం ఎంపిపి పీఠం అనువాయితి ప్రకారం సిపిఎం కు దక్కేనా ?...

వి.ఆర్.పురం ఎంపిపి పీఠం అనువాయితి ప్రకారం సిపిఎం కు దక్కనుందా ? అనే వాదన, సందేహం ప్రజల్లో వ్యక్తమవుతుంది. వి.ఆర్.పురం ఎంపిపి స్థానం వైసిపి పార్టీకి ఒకే ఒక్కసీటు దూరంలో నిలిచిపోయింది. వైసిపి 3 ఎంపిటిసి లను గెలుచుకున్నప్పటికీ, ఆ పార్టీకి ఇతర పార్టీల ఎంపిటిసి లకు గాలంవేసి ఎంపిపి కుర్చీ దక్కించుకునే అవకాశం కనుచూపు మేరలో ఇక్కడ కనిపించటం లేదు. ఇంతకాలం తమ చేతిలో ఉన్న జడ్.పి.టి.సి స్థానాన్ని కోల్పగొట్టిన వైసిపి పట్ల టిడిపి నాయకత్వం ఒకింత కసితో రగిలిపోతుంది. విడిపోయి ఓడిపోయామని మనో వేదనలో ఉన్న టిడిపి సిపిఎం కు మద్దతు ఇచ్చే అవకాశాలు ఉన్నట్లు పుకార్లు షికార్లు చేస్తున్నాయి. అదే జరిగితే టిడిపి, జనసేన కూటమి ఇద్దరు ఎంపిటిసి లు సిపిఎం కు మద్దతిస్తే, ఎంపిపి కి కావాల్

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీఏకు ప్రజల మద్దతు

-అభివృద్ధి, సుపరిపాలనకు ప్రజలు పట్టం కట్టారు-పంచాయతీ ఎన్నికల్లోనూ ఇదే స్ఫూర్తితో పనిచేయాలి: ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



రావులపాలెం, నవంబరు 09 (ప్రభాతవార్త) స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు ఎన్డీఏ కూటమికి మద్దతుగా నిలిచి అభివృద్ధి, సుపరిపాలనకు పట్టం కట్టారని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. గతంలో చేసిన అసత్య ప్రచారాలు, నిరాధార ఆరోపణలను ప్రజలు విశ్వసించలేదని, నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని కొనసాగించాలనే ఉద్దేశంతోనే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో కూటమికి విజయాన్ని అందించారని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంతో రేయింబవళ్లు కష్టపడి పనిచేశారని కొనియాడారు. అభ్యర్థులు, పార్టీలు, గుర్తులతో సంబంధం లేకుండా కూటమి విజయమే లక్ష్యంగా పనిచేసిన ప్రతి కార్యకర్తకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ విజయాన్ని కార్యకర్తలకు, ప్రజలకు అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు. పేదలు, వెనుకబడిన వర్గాలు, మహిళలు, అట్టడుగు వర్గాలకు ప్రాధాన్యతనిస్తూ ఎన్టీఆర్ ఆశయాలకు అనుగుణంగా తెలుగుదేశం పార్టీ ముందుకు సాగుతుందని తెలిపారు. 2024 ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా ఎన్డీఏ కూటమికి 164 స్థానాలు, కొత్తపేట నియోజకవర్గంలో 56,479 ఓట్ల మెజారిటీతో ప్రజలు మద్దతు తెలిపారని గుర్తుచేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ అదే ప్రజాభిమానం కొనసాగిందన్నారు. రాబోయే గ్రామపంచాయతీ ఎన్నికల్లోనూ కూటమి నాయకులు, కార్యకర్తలు ఇదే ఐకమత్యంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. గ్రామాల అభివృద్ధికి పంచాయతీలు కీలకమని, మంచి పాలన, స్థిరమైన అభివృద్ధి లక్ష్యంగా ప్రజల ఆశీస్సులతో ముందుకు సాగుతామని ఎమ్మెల్యే బండారు స్పష్టం చేశారు. అనంతరం రావులపాలెం మండలంలో విజయం సాధించిన జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో బండారు శ్రీనివాస్, కెవి సత్యనారాయణ రెడ్డి, ఆకుల రామకృష్ణ, చిలువూరి సతీష్ రాజు, నందం సత్యనారాయణ, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పోలవరం జిల్లా జడ్పీ వైస్ చైర్మన్ రేసులో చారపు వెంకటరాయుడు..



దేవీపట్నం సెప్టెంబర్ 9 ప్రభాతవార్త=పోలవరం జిల్లా రంపచోడవరం జడ్పీ పీఠం ఎంపిక రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారుతోంది. జడ్పీ చైర్మన్ పదవి తెలుగుదేశం పార్టీకి కేటాయించే అవకాశాలపై చర్చ జరుగుతున్న నేపథ్యంలో.. జడ్పీ వైస్ చైర్మన్ పదవి ఎవరికి దక్కుతుందనే అంశం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. కూటమి ధర్మాన్ని పాటిస్తూ ఎన్నికల్లో కీలకంగా వ్యవహరించిన జనసేన పార్టీకి వైస్ చైర్మన్ పదవి కేటాయించాలనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో దేవీపట్నం జడ్పీటీసీగా విజయం సాధించిన జనసేన యువ నాయకుడు చారపు వెంకటరాయుడు పేరు వైస్ చైర్మన్ రేసులో ప్రముఖంగా వినిపిస్తోందిజడ్పీటీసీ ఎన్నికల్లో దేవీపట్నం స్థానం జనసేన పార్టీకి కేటాయించడంతో చారపు వెంకటరాయుడు పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేశారు. మూడు పార్టీలైన జనసేన, తెలుగుదేశం, బీజేపీ నాయకులను ఒకే తాటిపైకి తీసుకొచ్చి కూటమి అభ్యర్థి గెలుపు కోసం సమన్వయంతో ముందుకు సాగారు. కేవలం జడ్పీటీసీ స్థానంలోనే కాకుండా ఎంపీటీసీ స్థానాల్లోనూ కూటమి అభ్యర్థుల విజయానికి తన వంతు కృషి చేశారు.జనసేన పార్టీకి రెండు ఎంపీటీసీ టికెట్లు కేటాయించిన నేపథ్యంలో కూటమి ధర్మాన్ని గౌరవిస్తూ మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ యువ నాయకుల విజయానికి కృషి చేయడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ముఖ్యంగా ఇందుకూరుపేట, పూడిపల్లి, రమణయ్యపేట పంచాయతీల పరిధిలో వైసీపీకి గట్టి పోటీ ఇచ్చి కూటమి అభ్యర్థుల విజయానికి జనసేన శ్రేణులు కీలకంగా పనిచేశాయి.రంపచోడవరం డివిజన్ పరిధిలోని ఎనిమిది జడ్పీటీసీ స్థానాల్లో కూటమి ఆరు స్థానాలు, వైసీపీ రెండు స్థానాలు గెలుచుకోవడం కూటమికి స్పష్టమైన ఆధిక్యాన్ని ఇచ్చింది. ఈ విజయాల్లో జనసేన పార్టీ సాధించిన 100 శాతం స్ట్రైక్ రేట్ ప్రత్యేక చర్చకు దారితీసింది. పార్టీకి కేటాయించిన స్థానాల్లో విజయాలు సాధించడంతో పాటు, కూటమి అభ్యర్థుల గెలుపు కోసం క్షేత్రస్థాయిలో పనిచేసిన నాయకుల పాత్ర కూడా ప్రాధాన్యత సంతరించుకుంది.వైస్ చైర్మన్ పదవిపై జనసేన ఆశలుఇప్పుడు అసలు రాజకీయ చర్చంతా జడ్పీ వైస్ చైర్మన్ పదవిపైనే సాగుతోంది. జడ్పీ చైర్మన్ పదవి టీడీపీకి కేటాయిస్తే, కూటమిలో భాగస్వామిగా ఎన్నికల్లో కీలక పాత్ర పోషించిన జనసేనకు వైస్ చైర్మన్ పదవి ఇచ్చే అవకాశాలు ఉన్నాయనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి. అదే జరిగితే దేవీపట్నం జడ్పీటీసీ చారపు వెంకటరాయుడికి అవకాశం కల్పించాలనే అభిప్రాయాలు జనసేన వర్గాల్లో వినిపిస్తున్నాయి.టికెట్ కేటాయించినప్పటి నుంచి పార్టీ కోసం శ్రమించడం, టీడీపీ, బీజేపీ నాయకులతో సమన్వయం చేసుకోవడం, ఎంపీటీసీ అభ్యర్థుల విజయానికి సహకరించడం, కూటమి ఐక్యతను క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడం వంటి అంశాలు వెంకటరాయుడి పేరును వైస్ చైర్మన్ రేసులో ముందుకు తెస్తున్నాయి.

మోతుగూడెం లొ లిక్విడ్ గంజాయి పట్టివేత !



మోతుగూడెం నవంబరు:9 ప్రభాతవార్త ఒడిశా నుంచి ఉత్తరప్రదేశ్‌కు తరలిస్తున్న పన్నేండున్నర లక్షల రూపాయల విలువైన ఒక కేజీ లిక్విడ్ గంజాయిని స్వాధీనం చేసుకుని ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు చింతూరు మండలం మోతుగూడెం ఎస్సైనాసిర్ హుస్సేన్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒడిశా రాష్ట్రం మల్కనగిరి జిల్లాలోని టెలరాయ్ గ్రామం నుంచి ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి అక్రమంగా తరలిస్తుండగా అనుమానస్పదంగా బస్ స్టాండ్ వద్ద కనిపించిన ముగ్గురు వ్యక్తులైన ఆశుజాఫ్రీ, ఉత్తరప్రదేశ్, ముకుందా హంతల్ ఒడిస్సా,మాలమదకామి ఒడిస్సా రాష్ట్రలకు, సంబంధించిన వీరి బ్యాగ్లను లను తనిఖి చేయగా సుమారు ఒక కేజీ లిక్విడ్ గంజాయి పట్టుబడిందని తెలిపారు.కేసు నమోదుచెసి కొర్టుకు తరలిస్తున్నమన్నారు.ఈ దాడిలో మోతుగూడెం ఏఎస్ఐ టీ. రాజేశ్వరరావు ఎం. గంగరాజు హెడ్ కానిస్టేబుల్ మురళి తదితర సిబ్బంది పాల్గొన్నారు.

కౌలు రైతులపై కనికరం చూపించాలి .

-తొలకరి పంట శిస్తు మాఫీ చేయాలి. కౌలు రైతుల మొర.



తాళ్లరేవు అక్టోబర్ 9 (ప్రభాతవార్త) : వరుస తుఫానులతో అల్లాడిపోతున్న కౌలు రైతులపై భూ యజమానులు కనికరం చూపించాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వళ్లు రాజబాబు విజ్ఞప్తి చేశారు. ఆర్నబ్ మురసు వరుస తుఫానులతో చేతికందిన పంట నాశనమైందని ఈ ఏడాది కౌలు చెల్లించలేని పరిస్థితి ఏర్పడిందని, పంట శిస్తు రద్దు చేయాలని పలువురు కౌలు రైతులు కోరారు. ఈ సందర్భంగా తాళ్ళరేవు మండలం పి. మల్లవరం పత్తి గొంది పంట కాలువ వంతెన వద్ద కౌలు రైతులు ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వొళ్ళు రాజబాబు ఆధ్వర్యంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాజు బాబు మాట్లాడారు. వరుసగా రెండు తుఫానుల వల్ల రైతులు కోలుకోలేని దెబ్బ తిన్నారని, నష్టపోయిన కౌలు రైతులు పట్ట భూ యజమానులు సానుకూలంగా స్పందించి ఈ తొలకరి పంట శిస్తు మాఫీ చేయాలని ఆయన కోరారు. ఇప్పటికే ఎకరానికి రూ .30 వేలు పెట్టుబడి పెట్టి పంట చేతికి వచ్చే సమయానికి నష్టం జరిగిందని ఐదు ఎకరాలు ఊడ్చే రైతుకు రూ. 1,50,000 లు పెట్టుబడి అయిందని అన్నారు. అందుచేత ప్రైవేట్ భూములు, భూ యజమానులు, దేవాదాయ భూములు శిస్తు మాఫీ కౌలు రైతును ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో పలువురు రైతులు కౌలు రైతులకు మద్దతుగా నిలిచారు. మిగిలిన భూ యజమానులు కౌలు రైతులపై కనికరం చూపించాలని రాజబాబు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక స్థానిక రైతులు పితాని సత్యనారాయణ, మేడిశెట్టి ఏడుకొండలు, దంగేటి ఉమాశంకర్, మేడిశెట్టి శ్రీనివాస్ ,గంజూ శ్రీనివాస్, గోవాల ఏడుకొండలు, మేడిశెట్టి బైరమ్మూర్తి, వాసంశెట్టి సూరిబాబు, కొప్పిశెట్టి రామకృష్ణ, పలువురు కౌలు రైతులు పాల్గొన్నారు.

ఆత్రేయపురం మండలం విజయంతో ఎమ్మెల్యే బండారుకు ఘన సన్మానం!

- 17 ఎంపీటీసీ స్థానాలతో పాటు జడ్పీటీసీ కైవసం.. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి: ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



ఆత్రేయపురం, నవంబర్ 09 (ప్రభాత వార్త):ఆత్రేయపురం మండలంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో జడ్పీటీసీ స్థానంతో పాటు 17 ఎంపీటీసీ స్థానాల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థులు విజయం సాధించిన నేపథ్యంలో మండలంలో విజయోత్సాహం నెలకొంది. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు, ఎన్డీఏ కూటమి నాయకులు స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావును మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు లభించిన ప్రజా మద్దతు పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ విజయానికి సహకరించిన ఎమ్మెల్యే నాయకత్వం, కూటమి శ్రేణుల కృషిని కొనియాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజలు మద్దతుగా నిలిచి తమకు ఈ విజయాన్ని అందించారని, ప్రజలు తమపై చూపిన ఆదరణ, అభిమానాన్ని ఎప్పటికీ మరువలేమని నాయకులు పేర్కొన్నారు.అదేవిధంగా ఉచ్చిలి ఎంపీటీసీ స్థానంలో ఘన విజయం సాధించిన తోటకూర సుబ్బరాజును ఆత్రేయపురం మండల ఎంపీపీగా ఎంపిక చేయడం పట్ల ఎమ్మెల్యే బండారు సత్యానందరావు హర్షం వ్యక్తం చేశారు. ప్రజల ఆశీస్సులతో ఎన్నికైన ఆయన మండల పరిషత్ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ అన్ని గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తారనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. నూతన నాయకత్వంలో మండల పరిషత్ ప్రజలకు మరింత చేరువై, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేయాలని ఆకాంక్షించారు.అనంతరం ఎమ్మెల్యే బండారు సత్యానందరావును మండల ఎన్డీఏ కూటమి ఎంపీటీసీ అభ్యర్థులు, మండల టీడీపీ అధ్యక్షుడు కూసంపూడి రామకృష్ణంరాజు, వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకటరాజు, ముళ్లపూడి భాస్కరరావు, తెలుగు యువత అధ్యక్షుడు వెచ్చా అనిల్ కుమార్, జుజ్జువరపు హరిబాబు, తోట రజిని తదితరులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు పరస్పరం అభినందనలు తెలుపుకుంటూ ఎన్నికల విజయాన్ని ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంపై ప్రజలకు ఉన్న విశ్వాసానికి ఈ ఎన్నికల ఫలితాలే నిదర్శనమన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రజలకు అందిస్తున్న సేవలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు తమ ఓటు ద్వారా మద్దతు తెలిపారని పేర్కొన్నారు. ఎన్నికల్లో ప్రజలు అందించిన తీర్పు తమపై మరింత బాధ్యతను పెంచిందని, ఈ విజయాన్ని కేవలం రాజకీయ విజయంగా కాకుండా ప్రజలకు మరింత సేవ చేసే అవకాశంగా భావించాలని నూతన ప్రజాప్రతినిధులకు సూచించారు.మండలంలోని 17 గ్రామాల సమగ్ర అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని ప్రజాప్రతినిధులంతా సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలో నెలకొన్న సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి వాటి పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని సూచించారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు, రహదారుల అభివృద్ధి, పారిశుధ్య నిర్వహణ, డ్రైనేజీ వ్యవస్థ, విద్యుత్ సదుపాయాలు, వీధి దీపాల ఏర్పాటు వంటి మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా ప్రజాప్రతినిధులు బాధ్యత తీసుకోవాలని చెప్పారు. గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని హితవు పలికారు.ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కార్యరూపంలోకి తీసుకురావడంతో పాటు గ్రామాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. పార్టీలు, రాజకీయాలకు అతీతంగా ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని, మండల అభివృద్ధి కోసం నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం సమన్వయంతో ముందుకు సాగాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ తమపై విశ్వాసం ఉంచి ఓట్లు వేసి గెలిపించిన ప్రజలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఎన్నికల్లో తమ విజయానికి కృషి చేసిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, కూటమి నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రజలు తమకు అప్పగించిన బాధ్యతలను అంకితభావంతో నిర్వహిస్తూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులకు ప్రాధాన్యతనిస్తూ మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని, ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఎమ్మెల్యే సహకారంతో వాటి పరిష్కారానికి సమష్టిగా పనిచేస్తామని తెలిపారు.

గర్భిణీలకు అల్పాహారం అందించి సేవా స్ఫూర్తి చాటిన దంపతులు



రాజమొమ్మంగి, నవంబరు 09, ప్రభాతవార్తరాజమొమ్మంగి మండలం జడ్డంగి ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం 50 మంది గర్భిణీలకు వైద్యులు డా. పావని, డా. నాగార్జున వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాత కొప్పిలి సత్యనారాయణరెడ్డి, లక్ష్మి దంపతులు గర్భిణీలకు తాగునీటి బాటిళ్లు, పెరుగు, బిస్కెట్లతో పాటు ఐదు రకాల వస్తువులతో కూడిన కిట్లు, అల్పాహారంగా అందించారు. గర్భిణీల ఆరోగ్య పరిరక్షణకు వైద్య సేవలతో పాటు దాతలు అందించిన సహకారం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వైద్య సిబ్బంది పేర్కొన్నారు. గర్భిణీలకు అండగా నిలిచి సేవా స్ఫూర్తిని చాటిన దంపతులను వైద్యాధికారులు, సిబ్బంది అభినందించారు. ఈకార్యక్రమంలో గొడుగు నాగవాసు, నీలాద్రి లక్ష్మి, భూముల వెంకటరమణ, మురళీ, లక్ష్మి, భవాని, ఏఎన్ఎంలు, అంగన్వాడీలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంతర్వేది నృసింహుని అన్నదానం నకు లక్ష విరాళం..



సఖినేటిపల్లి నవంబర్ 9, ప్రభాత వార్త:డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం అంతర్వేది గ్రామములో వేంచేసియున్న శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి ఆలయములో నిర్వహించే నిత్యాన్నదానట్రస్ట్ నకు పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం వాస్తవ్యులు ఆచంట సత్య వెంకట కృష్ణ నరసయ్య, ఝాన్సీ లక్ష్మి దంపతులు, వారి కుటుంబ సభ్యులు రూ 1,00,000 విరాళముగా సమర్పించినారు. శ్రీ స్వామివారి దర్శనం ఆలయ సీనియర్ అసిస్టెంట్ ఏం సత్య కిరణ్ శ్రీ స్వామి వారి చిత్రపటం, ప్రసాదములను అందజేసినారు. ఈ కార్యక్రమంలో ధాత కుటుంబ సభ్యులు పాల్గొనారు.

తుఫాను బాధితులకు యూనియన్ బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ అండ



మామిడికుదురు. నవంబర్09 (ప్రభాతవార్త)తుఫాను ప్రభావిత ప్రాంతాల్లోని నిరాశ్రయులను ఆదుకునేందుకు ఆంధ్రప్రదేశ్ యూనియన్ బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాజమండ్రి రీజియన్ ముందుకు వచ్చింది. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా,మామిడికుదురు,రాజోలు మండలాల్లోని తుఫాను ప్రభావిత గ్రామాల్లో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత లో భాగంగా కరవాక గ్రామంలోని 150 కుటుంబాలకు, కేశవదాసుపాలెంలోని 150 కుటుంబాలకు కలిపి మొత్తం 300 బాధితుల కుటుంబాలకు నిత్యావసర సరుకులు, సహాయ సామగ్రిని అందజేశారు.ఈ సహాయక చర్యల్లో యూనియన్ బ్యాంక్ రీజినల్ హెడ్ ఎ. విశ్వేశ్వరరావు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ వర్మ పాల్గొని బాధితులకు స్వయంగా సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రకృతి విపత్తుల వేళ సర్వస్వం కోల్పోయి నిరాశ్రయులైన ప్రజలకు బాసటగా నిలిచి, వారిలో ధైర్యం కల్పించడమే తమ అసోసియేషన్ ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బ్యాంకు బ్రాంచ్ హెడ్స్ వి.వి. చక్రదొర, అరవింద్ సూర్య, నాదిర్ షా హుస్సేన్‌లతో పాటు యూనియన్ నాయకులు ఎం.ఎస్.ఎన్. రాజు, డి.ఎస్. ప్రసాద్, ఇతర ముఖ్య నాయకులు, బ్యాంకు సిబ్బంది,స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కష్టకాలంలో తమను ఆదుకోవడానికి తక్షణమే స్పందించిన బ్యాంక్ అధికారుల అసోసియేషన్‌కు లబ్ధిదారులు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.సోసియేషన్‌కు లబ్ధిదారులు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలి: వైఎస్సార్ సీపీ కో-ఆర్డినేటర్ పాముల రాజేశ్వరీదేవి



మామిడికుదురు, నవంబర్09(ప్రభాతవార్త) ప్రజలు ఎంతో నమ్మకంతో ఎంపీటీసీగా గెలిపించారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయాలని రాజోలు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కో--ఆర్డినేటర్ పాముల రాజేశ్వరీదేవి పిలుపునిచ్చారు. మామిడికుదురు--2 ఎంపీటీసీగా ఘన విజయం సాధించిన కొల్లాబత్తుల అన్నపూర్ణను రాజేశ్వరీదేవి సోమవారం మామిడికుదురులో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కటకంశెట్టి ఆదిత్య ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అన్నపూర్ణకు పూలమాల వేసి, శాలువాతో సన్మానించారు. అనంతరం రాజేశ్వరీదేవి మాట్లాడుతూ.. వైఎస్సార్ సీపీకి అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ పార్టీ తరపున ఎంతో రుణపడి ఉంటామని పేర్కొన్నారు.ఈ సన్మాన కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షులు బొలిశెట్టి భగవాన్, గ్రామ శాఖ అధ్యక్షులు కంచి శ్రీరామ్, జిల్లా యూత్ విభాగం కార్యదర్శి కొల్లాబత్తుల మున్నా, పార్టీ నాయకులు మజహర్ అలీ, విప్పర్తి మహేష్ తదితరుల తోపాటు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కలెక్టర్ ఆదేశాలతో హాస్టళ్లలో ముమ్మరంగా వైద్య తనిఖీలు



మామిడికుదురు .నవంబర్09 (ప్రభాతవార్త)జిల్లా కలెక్టర్ గారి ఆదేశాల మేరకు తుఫాను తదనంతర చర్యల్లో భాగంగా నియోజకవర్గంలోని ప్రభుత్వ హాస్టళ్లలో విస్తృతంగా వైద్య తనిఖీలు,పరిశీలన కార్యక్రమాలు నిర్వహించారు. హాస్టళ్లలో ఉంటున్న ప్రతి విద్యార్థి ఆరోగ్య వివరాలను వైద్య బృందం క్షుణ్ణంగా పరిశీలించింది. ముఖ్యంగా విద్యార్థుల్లో రక్తహీనత (అనీమియా), కంటి సమస్యలు,చెవి, ముక్కుగొంతు సమస్యలు,దంత,చర్మ సంబంధిత వ్యాధులపై ప్రత్యేకంగా స్క్రీనింగ్ నిర్వహించి, అవసరమైన వారికి తక్షణమే మందులను పంపిణీ చేశారు.ఆరోగ్య తనిఖీలతో పాటు హాస్టళ్లలోని మౌలిక వసతులు, పరిశుభ్రతపై ప్రత్యేక నిఘా పెట్టారు. విద్యార్థులకు అందుతున్న త్రాగునీటి నాణ్యత,నివాస గదులు, పంటశాలలు, టాయిలెట్ల పరిశుభ్రతతో పాటు హాస్టల్ కాంపౌండ్ వాల్ పరిధిలో ఉన్న పరిసరాలను అధికారులు పరిశీలించారు. విద్యార్థులకు, సిబ్బందికి వ్యక్తిగత పరిశుభ్రత, అంటువ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించి తగిన సూచనలు చేశారు.ఈ బృహత్తర వైద్య శిబిరం,పరిశీలన కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ ఐ. జాన్ లెవి, డాక్టర్ టి. పావని, డాక్టర్ హెచ్.చిన్నయి,హెల్త్ సూపర్‌వైజర్ బి. నరసింహారావు, ఎం.ఎల్.హెచ్.పిలు పి. నాగదుర్గ, ఆర్.సుమ, ఎం.పి.హెచ్.ఎ(మేల్) కె.వి.శ్రీనివాసరావు, ఏ.ఎన్.ఎం ఎం. జయకుమారి,ఆశా కార్యకర్తలు సిబ్బందితో కలిసి పాల్గొన్నారు.

తుఫాను బాధితులకు యూనియన్ బ్యాంక్ ఆఫీసర్స్ సహాయం..



సఖినేటిపల్లి నవంబర్ 9, ప్రభాత వార్త:డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, రాజోలు నియోజకవర్గంలోని తుఫాను ప్రభావిత గ్రామాల్లో ఆంధ్రప్రదేశ్ యూనియన్ బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాజమండ్రి రీజియన్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకుల పంపిణీని నిర్వహించారు. తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద కరవాక గ్రామంలోని 150 కుటుంబాలకు, అంతర్వేది పల్లిపాలెం, కేశవదాసుపాలెంలో 150 కుటుంబాలకు కలిపి మొత్తం 300 బాధితుల కుటుంబాలకు నిత్యావసర సరుకులను అందజేశారు. రీజినల్ హెడ్ ఎ. విశ్వేశ్వరరావు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ వర్మ పాల్గొని బాధితులకు సరుకులను పంపిణీ చేశారు. ప్రకృతి విపత్తుల వేళ నిరాశ్రయులైన ప్రజలకు బాసటగా నిలిచి ధైర్యం కల్పించడమే తమ లక్ష్యమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ హెడ్స్ వి.వి. చక్రదొర, యు రవి బాబు, అరవింద్ సూర్య, ఎన్. హుస్సేన్ తో పాటు యూనియన్ నాయకులు ఎం.ఎస్.ఎన్. రాజు, డి.ఎస్. ప్రసాద్, ఇతర ముఖ్య నాయకులు, బ్యాంకు సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు. పలువురు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్నాబ్ తుఫాన్‌లో విద్యుత్ ఉద్యోగుల సేవలు వెలకట్టలేనివి: చైర్ పర్సన్ విజేత వేగుళ్ల అజయ్ కుమార్



మండపేట నవంబర్ 09(ప్రభాతవార్త): ఇటీవల ఎదురైన ఆర్నాబ్ తుఫాన్ సమయంలో విద్యుత్ శాఖ సిబ్బంది అందించిన సేవలు ఎంతో గొప్పవని మండపేట మున్సిపల్ చైర్ పర్సన్ విజేత వేగుళ్ల అజయ్ కుమార్ కొనియాడారు. సోమవారం మండపేట తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మండపేట పట్టణ విద్యుత్ శాఖ సిబ్బంది, యూనియన్ నాయకులు అజయ్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు దుశ్శాలువా కప్పి, పూలమాలలతో సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం అజయ్ బాబు మాట్లాడుతూ ఆర్నాబ్ తుఫాన్ సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ, విద్యుత్ శాఖ సిబ్బంది అహర్నిశలు శ్రమించి సరఫరా పునరుద్ధరణకు కృషి చేశారని ప్రశంసించారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహించి ప్రజలకు సేవలందించడం అభినందనీయమన్నారు. ప్రకృతి విపత్తుల సమయంలో విద్యుత్ ఉద్యోగుల బాధ్యత మరింత పెరుగుతుందని, ప్రజలకు సత్వర సేవలు అందించడంలో వారి నిబద్ధత ప్రశంసనీయమని పేర్కొన్నారు. విద్యుత్ శాఖ సిబ్బంది, యూనియన్ నాయకులు తనను కలిసి అభినందించడం ఆనందంగా ఉందని, వారి సేవలకు ఎల్లప్పుడూ గుర్తింపు, గౌరవం ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ సిబ్బంది, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

నృసింహుని జన్మ నక్షత్రం స్వాతి పూజలు....



సఖినేటిపల్లి నవంబర్ 9, ప్రభాత వార్త:డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం అంతర

24 నుంచి భవానీ మండల దీక్షలు ప్రారంభం
-గురుభవాని తోట సూరిబాబు



రాజమ్మంగి, నవంబరు 09, ప్రభాతవార్తరాజమ్మంగి మండలం జడ్డంగి గ్రామంలోని దుర్గాదేవి ఆలయం వద్ద ఈనెల 24వ తేదీ మంగళవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా భవానీ మండల దీక్షలు ప్రారంభించనున్నట్లు గురుభవాని తోట సూరిబాబు తెలిపారు. భవానీ మాల ధరించి దీక్ష చేపట్టాలనుకునే భక్తులు ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. భవానీ దీక్షలు చేపట్టే భక్తులు అమ్మవారి నామస్మరణతో భక్తిశ్రద్ధలతో నియమ నిష్ఠలను పాటిస్తూ దీక్షను కొనసాగించాలని తెలిపారు. భవానీ మండల దీక్షల ద్వారా భక్తుల్లో ఆధ్యాత్మిక భావన, భక్తి విశ్వాసాలు పెంపొందుతాయని పేర్కొన్నారు. దీక్షలు చేపట్టే భక్తులు ముందస్తుగా పేర్లు నమోదు చేసుకుని కార్యక్రమానికి సిద్ధం కావాలని కోరారు. వచ్చే ఏడాది జనవరి 3వ తేదీన భవానీలు దీక్షలను విరమించనున్నట్లు గురుభవాని తోట సూరిబాబు వెల్లడించారు.

ఆత్రేయపురం జడ్పీటీసీగా గూడపాటి శ్రీనివాసరావు ఎన్నిక ధ్రువీకరణ పత్రం స్వీకరణ!
-10,002 ఓట్ల భారీ మెజారిటీతో ఘన విజయం.. కూటమి శ్రేణుల్లో హర్షాతిరేకాలు

ఆత్రేయపురం: నవంబర్ 09 ప్రభాత వార్త: ఆత్రేయపురం మండల జడ్పీటీసీగా తెలుగుదేశం పార్టీ అభ్యర్థి గూడపాటి శ్రీనివాసరావు ఘన విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి వైసీపీ అభ్యర్థి కప్పల శ్రీధర్‌పై 10,002 ఓట్ల భారీ మెజారిటీతో గెలుపొందారు. ఈ మేరకు సోమవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద సీఈవో పి. వసంత మాధవి, ఎంపీడీవో పి.వి.ఆర్.కె. రాజు చేతుల మీదుగా ఎన్నిక ధ్రువీకరణ పత్రాన్ని అందుకున్నారు. ఆయన విజయంపై ర్యాలి గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పెండెం వెంకన్న, కొనాల వెంకటరావు,కూటమి నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

పేరుకు గ్రంథాలయం ఆమె దృష్టికి అది దేవాలయం
-శోభిత్ వర్మ సేవా పురస్కారాన్ని అందుకున్న లైబ్రేరియన్ సునీత




కొత్తపేట, నవంబర్ 09,(ప్రభాతవార్త)కొత్తపేట ద్వితీయ శ్రేణి గ్రంథపాలకురాలు కుంచే సునీత అరుదైన సేవా పురస్కారం అందుకున్నారు మండలంలోని అవిడి గ్రామానికి చెందిన సునీత తను పనిచేస్తున్న గ్రంథాలయాన్ని దేవాలయంగా భావించి 2014లో తన సొంత ఖర్చులతో రంగులు వేయించారు అలాగే గ్రంథాలయంలో కుర్చీలు లేకపోవడంతో స్థానిక నాయకుల సహకారంతో ఎమ్మెల్యే బండారు సత్యానంద రావుతో మాట్లాడి వారి తండ్రి బులి సత్యం పేరున 40 కుర్చీలను సమకూర్చారు అదేవిధంగా 2025వ సంవత్సరంలో రోటరీ క్లబ్ సహకారంతో కొత్తపేట గ్రంథాలయ భవనానికి పెయింటింగ్ వేయించారు కేవలం విధి నిర్వహణ మాత్రమే కాకుండా తాను పనిచేస్తున్న గ్రంథాలయాన్ని ఎంతోకొంత అభివృద్ధి చేయాలనే దృక్పథంతో పనిచేస్తున్న ఆమె సేవలను గుర్తిస్తూ శోభిత్ వర్మ చారిటబుల్ ట్రస్ట్ సునీతను ఘనంగా సత్కరించింది శోభిత వర్మ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు ప్రఖ్యాత ఇంద్రజాలికులు డాక్టర్ చల్లగాలి శ్రీనివాస్ వర్మ కళ్యాణి దంపతుల ఆధ్వర్యంలో నెల నెలా ముగ్గురు కళాకారులను ముగ్గురు సామాజిక సేవలందించే వారిని సత్కరిస్తున్న విషయం తెలిసిందే ఆ మేరకు సేవల విభాగం నుంచి సునీతను రాజమహేంద్ర వరంలోని జ్ఞాన సరస్వతి ఘాట్ వద్ద ముఖ్య అతిథులు సేవా పురస్కారంతో సునీతను ఘనంగా సత్కరించారు

మత్స్యకారులకు నిత్యవసర సరుకుల పంపిణీ
- దేవరపల్లి మండల తహసీల్దార్ రాజాబాబు



దేవరపల్లి, నవంబర్ 9(ప్రభాతవార్త):ఆర్నాబ్ తుఫాన్ కారణంగా ఉపాధి కోల్పోయి ఇబ్బందులు పడుతున్న దేవరపల్లి మండలంలోని యర్నగూడెం త్యాజంపూడి గ్రామాల మత్స్యకారులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భరోసానిచ్చింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం ఆయా గ్రామాలలోని మొత్తం 239 మంది మత్స్యకారులకు మండల తహసీల్దార్ ఏ. రాజాబాబు నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా లబ్ధిదారులకు ఒక్కో కుటుంబానికి 50 కిలోల బియ్యం, కిలో చొప్పున వంటనూనె, కందిపప్పు, ఉల్లిపాయలు బంగాళాదుంపలను అందజేశారు.తుఫాన్ సమయంలో తమను ఆదుకుని, తక్షణ సహాయం అందించిన రాష్ట్ర ప్రభుత్వానికి యర్నగూడెం ఫిషర్ మెన్ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్ష కార్యదర్శులు ముంగర అయ్యన్న, గనుసుల సుబ్బారావు, సంఘ సభ్యులు ముంగర లక్ష్మణరావు, గనుసుల రాంపండు, సిరివేరు పోతురాజు, ముంగర రామకృష్ణ, గనుసుల సోమరాజు తదితరులు కృతజ్ఞతలు, తెలిపారు.ఈ కార్యక్రమంలో వీఆర్ఓ కొప్పిశెట్టి గంగాజలం, రేషన్ డీలర్ పోశింశెట్టి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లి మండలంలో రైతులు పంట నష్టం నమోదు చేసుకోవాలి
-వ్యవసాయ శాఖ అధికారి కమల్ రాజ్ సూచన



దేవరపల్లి. నవంబర్ 9 (ప్రభాతవార్త) ఇటీవల వరుసగా సంభవించిన ఆర్నాబ్. మురుసు తుఫానులకు సంబంధించి దేవరపల్లి మండలంలో 2000 ఎకరాలలో వరి పంట మరియు 500 ఎకరాలు విస్తీర్ణంలో మినుము పంట నష్టానికి గురైనట్లు ప్రాథమికంగా అంచన వేసి యాప్లో నమోదు చేయటమైనది కావున రైతు సోదరులందరూ ఒకవేళ మీ పంట నష్టం జరిగినట్లయితే మీ రైతు సేవ కేంద్రం సిబ్బందిని సంప్రదించి నీ నష్టపోయిన పంట వివరాలు నమోదు చేయించుకోవాల్సిందిగా రైతులందరికీ తెలియజేయడమైనది అదేవిధంగా ఒకవేళ మీరు కూడా నేరుగా పట్టణమోదును ఏపీ ఏఐఎంఎస్ యాప్ ద్వారా కూడా నమోదు చేసుకునే అవకాశం ఉంది కాబట్టి రైతు సోదరులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని ముర్సు తుఫాను వల్ల నష్టపోయిన పంట వివరాలు నమోదు చేయించుకునివలసిందిగా మండలంలోని రైతులకు వ్యవసాయ శాఖ అధికారి కమల్ రాజ్ సూచించారు.

తాళ్లరేవు కూటమి జెడ్పీటిసి గా పెసింగి



వీరరాఘవ. తాళ్లరేవు, నవంబర్ (ప్రభాతవార్త): తాళ్లరేవు జడ్పిటిసి స్థానాన్ని కూటమి టిడిపి అభ్యర్థి పెసింగి వీర రాఘవ కైవసం చేసుకున్నారు. తన సమీప ప్రత్యర్థి వైకాపా కి చెందిన అంకాడి భాగ్యవతిపై 5,716 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. వీర రాఘవ కు 25,633 ఓట్లు రాగా భాగ్యవతికి 19,917 ఓట్లు వచ్చాయి. దీంతో వీరరాఘవ జడ్పిటిసిగా గెలుపొందినట్లు అధికారులు ప్రకటించారు. ఆమె ఆమె భర్త ఈశ్వరరావు గతంలో తెదేపా తరపున తాళ్లరేవు జడ్పిటిసి గా ఐదు ఏళ్లపాటు పాటు పదవి నిర్వహించారు. మండలంలో 24 ఎంపీటీసీలకు గాను 17 కూటమి అభ్యర్థులు కైవసం చేసుకోవడంతో జడ్పిటిసి గెలుపు సునాయాసమయింది. కూటమి ఎంపీటీసీ అభ్యర్థులకు వచ్చిన మెజారిటీతో పోల్చి చూస్తే కూటమి జెడ్పిటిసి కి వచ్చిన ఓట్లు కొంత తగ్గినట్లు తెలుస్తుంది. ఇదిలా ఉంటే అధికార కూటమి, ప్రతిపక్ష వైకాపా పార్టీల అభ్యర్థులు ఇద్దరూ ఒకే గ్రామానికి చెందిన వారు కావడం విశేషం.

ఆదిత్య యూనివర్సిటీలో ఏ.ఐ ఆధారిత అధునాతన పదార్థాలపై ఏఐసీటీఈ
- అటల్ వాణి జాతీయ స్థాయి శిక్షణా కార్యక్రమం ప్రారంభం



గండేపల్లి. నవంబర్ 9. ప్రభాతవార్తఆదిత్య యూనివర్సిటీ, రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఏ.ఐ.సీ.టీ.ఈ - - అటల్ వాణి పథకం సహకారంతో "అధునాతన నానో మెటీరియల్స్ రంగంలో ఎ.ఐ-ఆధారిత నూతన ధోరణులు మరియు వాటి సుస్థిర అభివృద్ధి"అనే అంశంపై మూడు రోజుల జాతీయ స్థాయి శిక్షణా కార్యక్రమం 2026 నవంబర్ 9 నుండి 11వ తేదీ వరకు నిర్వహించబడుతోంది అని డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డా ఎం శ్రీనివాసరెడ్డి తెలిపారు.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డా. ఎం శ్రీనివాసరెడ్డి ప్రో వైస్ ఛాన్సలర్ డా. రమాశ్రీ, ప్రో వైస్ ఛాన్సలర్ (జుఆ) డా. రమేష్, డీన్ -- రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డా. ఏ. శరవణన్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కోఆర్డినేటర్ డా. ఈ. రాజేష్, కో-కోఆర్డినేటర్ డి. శ్రావణి సమన్వయం వహించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ, ఆధునిక శాస్త్ర సాంకేతిక రంగాలలో నానో టెక్నాలజీ కీలక పాత్ర పోషిస్తోందని, ముఖ్యంగా కృత్రిమ మేధస్సు సహాయంతో అధునాతన నానో పదార్థాల రూపకల్పన, పరిశోధన, విశ్లేషణ మరియు వాటి వినియోగంలో నూతన అవకాశాలు ఏర్పడుతున్నాయని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ, స్థిరమైన అభివృద్ధి, ఆరోగ్య సంరక్షణ, ఇంధన రంగం మరియు పారిశ్రామిక అనువర్తనాలలో నానో పదార్థాల ప్రాధాన్యతను వివరించారు.ఈ మూడు రోజుల శిక్షణా కార్యక్రమంలో అధునాతన నానో పదార్థాల తయారీ, లక్షణ నిర్ధారణ, ూ× ఆధారిత పరిశోధనా పద్ధతులు, నానో టెక్నాలజీలో తాజా ఆవిష్కరణలు మరియు పర్యావరణహిత సాంకేతిక పరిజ్ఞానాలపై నిపుణులు తమ విలువైన అనుభవాలను, పరిశోధనా పరిజ్ఞానాన్ని పాల్గొనే అధ్యాపకులు మరియు పరిశోధకులతో పంచుకోనున్నారు.

ఉచిత బియ్యం పంపిణీ



ముమ్మిడివరం, నవంబర్ 9 ప్రభాతవార్త తుఫాన్ బారిన పడ్డ తుఫాను బాధిత కుటుంబాలకు ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని సోమవారం ప్రభుత్వం ఉచితంగా బియ్యం పంపిణీ కార్యక్రమం చేపట్టింది. ముమ్మిడివరం మండలంలో తుఫాన్ పునరావాస్ కేంద్రంలో తలదాచుకున్న పలు వార్డులలోని కుటుంబాలకు 10 కేజీలు పంతున , చేనేత మగ్గం కార్మికుల కుటుంబాలకు 50 కేజీల బియ్యం నిత్యవసర వస్తువుల కిట్లును ముమ్మిడివరం నగర పంచాయతీ చైర్మన్ గుబ్బల రత్న గంగాభవాని వెంకటేశ్వరరావు సోమవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముమ్మిడివరం తహసీల్దార్ టి సుభాష్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు తాడి నరసింహారావు కౌన్సిలర్లు నిమ్మకాయల విశ్వేశ్వరరావు రెడ్డి సుబ్బారావు పితాని రాము కట్టా సత్తిబాబు మేడిద భాస్కరరావు జూగు రాంబాబు డీలర్లు కొమ్మిరెడ్డి సూరిబాబు మాదాల త్రిమూర్తులు గుద్దటి సుబ్బారావు లతోపాటు పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు తుఫాను బాధితులు గ్రామ రెవిన్యూ అధికారులు మోహన్ రావు కనకాల వెంకటరావు లతోపాటు పలువురు పాల్గొన్నారు.

గెలుపే ముఖ్యం కాదు.. ప్రజలకు చేరువ కావడమే ప్రధానం..
-అధైర్య పడకండి.. పార్టీ అండగా ఉంటుంది..



అంబాజీపేట,నవంబర్ 9,(ప్రభాతవార్త):మండల,జిల్లా పరిషత్ ఎన్నికల్లో వైయస్సార్సిపి నుండి ఎంపీటీసీ, జడ్పిటిసి అభ్యర్థులుగా పోటీ చేసి పరాజయం పాలైన అభ్యర్థులు అధైర్య పడకుండా ఉండాలని, గెలుపే ముఖ్యం కాదని, ప్రజలకు చేరువ కావడమే ప్రధానమని వైయస్సార్సీపి మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్ అన్నారు.గంగలకుర్రు అగ్రహారం శివారు గంగలకుర్రు మలుపులో ఇంద్రశేఖర్ స్వగృహంలో పార్టీ నాయకులతో సోమవారం సమావేశమయ్యారు.మండలంలోని ఆయా గ్రామాల్లో ఎంపీటీసీ అభ్యర్థులుగా పోటీ చేసి స్వల్ప ఓట్లతో ఓటమి పాలవడం బాధాకరమన్నారు.జడ్పిటిసి,ఎంపీటీసీ అభ్యర్థుల విజయం కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పని చేశారని, వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నామన్నారు. ఓటమిపాలైన అభ్యర్థులు ఎవరు అందోళన చెందవలసిన అవసరం లేదని,ప్రజల మద్దతు మనకు ఉందన్నారు. పార్టీ తరపున పోటీ చేసి విజేతలైన నలుగురు ఎంపిటిసి అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సమావేశంలో ఎం.ఎం.శెట్టి, కొర్లపాటి కోటబాబు, విత్తనాల దుర్గాభవాని,వాసంశెట్టి పెద్దబాబు,దొమ్మేటి వెంకటేశ్వరరావు,సూదాబత్తుల రాము, మైలా ఆనందరావు, మట్టపర్తి యజ్ఞశ్రీ,రాయుడు మీరయ్య,కాండ్రేగుల శ్రీనివాసరావు,యల్లమెల్లి జయ బాబు, కాండ్రేగుల గణేష్, పలివెల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కళావిహీనంగా కాంతుల పండగ



గండేపల్లి. నవంబర్ 9. ప్రభాతవార్తదీపావళి... దీపాల వరుస దీని వెనుక రక రకాల కథలు గాథలు పలు రకాల పురాణ హితి హాసాలు ప్రచారంలో ఉన్నప్పటికీ వాటి సంగతి పక్కన పెడితే ఇది పేద మధ్య తరగతి ధనికులు అనే బేధం లేకుండా అందరూ పిల్లా పాపలతో టపాసులు కాల్చుకొని ఆనందోత్సాహాలతో జరుపుకునే పండుగ దీపావళి. అయితే ఈ పండుగ రాను రాను పేద మధ్య తరగతి వారికి దూరం అవుతూ వస్తుంది.. పూర్వం పిల్లలు తమ అభిరుచికి తగ్గ టపాసులను ఇంటి వద్దనే తయారు చేసుకునేవారు అందుకు కావలసిన సామాగ్రిని నెలరోజుల ముందునుండి సమకూర్చుకునేవారు.. అయితే కాలక్రమేణా అంత తీరిక ఓపిక లేని నేటి తరం పిల్లలు ఒక్కరోజు ముందు లేదా దీపావళి రోజున దుకాణాలకు వెళ్లి కొనుగోలు చేయడం మొదలైంది ఈ అవకాశాన్ని క్యాష్ చేసుకుంటూ వ్యాపారస్తులు తమ ఇష్టానుసారం అధిక ధరలకు క్రాకర్స్ ని విక్రయించడం వారి పై అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్ల టపాసులు కొనకుండానే రేట్లు చురుక్కు మంటున్నాయి .. ఈ పండుగ పేదవారికి భారంగా మారింది, తద్వారా వెలుగుల పండుగ కళావిహీనంగా ఎటువంటి కాంతులు, వెలుగు జిలుగులు పెద్ద పెద్ద శబ్దాలు లేకుండా చప్పగా సాగిపోతుంది... కాలం గడిచే కొలది గతమెంతో.. ఘణంగా వర్తమానం భారంగా ను మారిపోతుంది .. ఆకాశానికి అంటే ధరల పుణ్యమా అని ఆకాశం వైపు చూస్తే ఒక్క తారాజువ్వ కానరాని దీపావళి ని ప్రజలు జరుపుకున్నారు.. ఆ రోజుల్లో దీపావళి... మా రోజుల్లో.. దీపావళి రాబోవు రోజుల్లో దీపావళి పండుగ జరుపుకునేవారట టపాసులు కాల్చుతూ ఆనందంగా జరుపుకునేవారట అనే విధంగా మారిపోతుంది..

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు హక్కు అర్హులు విధిగా నమోదు చేసుకోవాలి



దేవరపల్లి, నవంబరు 9 (ప్రభాతవార్త) ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల జాబితా నమోదు ప్రక్రియపై తహశీల్దార్ ఏ. రాజబాబు కార్యాలయంలో సర్వపక్ష ప్రతినిధులతో ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని అర్హులైన ఉపాధ్యాయులందరూ తమ ఓటు హక్కును పొందేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవడానికి నిర్ణీత ఫారమ్-19 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు. గతంలో ఓటు హక్కు ఉన్నప్పటికీ, నిబంధనల ప్రకారం ఉపాధ్యాయులందరూ మరలా కొత్తగా ఫారమ్-19 నింపి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.అర్హులైన ఉపాధ్యాయులు అవసరమైన సర్వీస్ సర్టిఫికేట్, ఆధారిత పత్రాలను జతచేసి ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఓటర్ల నమోదు వేగవంతంగా జరగడానికి, ఏ ఒక్క అర్హుడైన ఉపాధ్యాయుడు ఓటు హక్కు కోల్పోకుండా ఉండేందుకు రాజకీయ పార్టీల నాయకులు, ప్రతినిధులు అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు తంగెళ్ల మునేశ్వరరావు, బిజెపి నిమ్మగడ్డ శ్రీనివాసరావు, జనసేన కొండపల్లి రమేష్ బాబు, సిపిఐ ఆచంట సత్యనారాయణ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి.. తక్షణమే నష్టపరిహారం చెల్లించాలి..

అంబాజీపేట, నవంబర్ 9,(ప్రభాతవార్త):అర్నబ్,మురుసు తుపానుల కారణంగా నష్టపోయిన పంటలకు తక్షణమే నష్ట పరిహారం అందించి రైతులను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని భారతీయ కిసాన్ సంఘ్, శ్రీ వ్యాఘ్రేశ్వరం ఐక్య రైతు సంఘ నాయకులు డిమాండ్ చేశారు. తుపానుకు, వర్షాలకు తక్షణమే నష్ట పరిహారం ఇప్పించాలని, రైతులకు సహాయం అందించేందుకు ఉపాధి కూలీలను ఏర్పాటు చేయాలని కోరుతూ అంబాజీపేట తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం సంఘ నాయకులు పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ వర్షాలకు, తుపాను కారణంగా వరి, అరటి, కోకో, కూరపాదులు, ఇళ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయన్నారు. ఇప్పటి వరకు పంట నష్టాలను సర్వే చేయించలేదన్నారు. ఒక పక్క తుపాను, భారీ వర్షాలు వచ్చి ప్రజలు,రైతులు నానా ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వానికి ఇవేమీ పట్టనట్లుగా వ్యవరించడం దారుణమన్నారు. పంట నష్టం ఇవ్వడంతో పాటు చేలల్లో విరిగి పడిపోయిన కొబ్బరి, కోకో, అరటి తోటలు స్థానే నూతన మొక్కలు నాటుకునేందుకు ఉచితంగా మొక్కలు పంపిణీతో పాటు ఎరువులను ఉచితంగా ఇవ్వాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీడీఓ బి, మమత, తహసీల్దార్ కార్యాలయంలో అందజేశారు.

దండకారణ్యం పరిసర గ్రామాల వెంట దర్జాగా సంచరిస్తున్న పెద్దపులి





వి.ఆర్.పురం,నవంబర్ 9,ప్రభాతవార్త వి.ఆర్.పురం అటవి రేంజ్, పాపికొండల అభయారణ్యం పరిసర గ్రామాల తోపాటుగా, గోదావరి, శబరి నది పరివాహక గ్రామాల వైపు తోటల వెంబడి పెద్దపులి దర్జాగా సంచరిస్తున్నట్లు మండల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత నెల 29 న మండలంలోని గల్లేటివాడ గ్రామం వద్ద, అదే గ్రామానికి చెందిన గిరిజన రైతు వంజం దూలయ్య రెండు దుక్కిటెద్దులపై దాడిచేసి చంపిన పెద్దపులి తన దిశ మార్చుకుంది. తాజాగా మండలంలోని కల్తునూరు, చొక్కనపల్లి, శ్రీరామగిరి, సీతంపేట, వడ్డిగూడెం, అన్నవరం వైపు మిర్చి తోటల వైపు సంచరిస్తున్నట్లు స్థానిక రైతులు, కూలీలు, గిరిజనులు చెప్తున్నారు. అటవి శాఖ అధికారులు పెద్దపులి సంచారాన్ని నిర్ధారించారు. పెద్దపులి రక్షణ చర్యలు చేపట్టారు. సోమవారం స్థానిక అటవి శాఖ అధికారులు, సిబ్బంది బృందాలుగా ఏర్పాటి సంభందిత గ్రామాల్లో ప్రజలకు పెద్దపులి పట్ల అవగాహన కల్పించారు. హఠాత్తుగా పెద్దపులి ఎదురైతే తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. ముఖ్యంగా ప్రజలు ఎవరు తెల్లవారుజామున, సాయంత్రం వేళల్లో ఒంటరిగా అటవి ప్రాంతాల్లోకి వెళ్లవద్దన్నారు. ఒకవేళ పులి తారసపడితే దాని దగ్గరకు వెళ్లడం, దాన్ని రెచ్చగొట్టడం, తరమాలనే ప్రయత్నాలు చేయవద్దన్నారు. పులి సంచారం గుర్తించిన ప్రాంతాల్లో పశువులను మేతకు తొలకెళ్ళ వద్దని చెప్పారు. చిన్న పిల్లలు, పశువుల పై నిత్యం పర్యవేక్షణ ఉంచాలన్నారు. అటవి పరిసర గ్రామాలవారు రాత్రి వేళల్లో ప్రయాణాలు విరమించుకోవాలని సూచించారు. పులి సంచారానికి సంబంధించి వదంతులను నమ్మవద్దన్నారు. పులి కనిపించినా, పాదముద్రలు గుర్తించినా, ఎక్కడైనా పశువులపై పులి దాడి చేసినా అటవి శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. మనుషుల ప్రాణాలకు హాని కలిగిస్తుందనే భయంతో ఎవరు పెద్దపులి కి హాని తలపెట్టవద్దని కోరారు. అలా ఎవరైనా వన్యప్రాణుల ప్రాణాలకు హాని తలపెడితే ఖఠినమైన చట్టాలు ఉన్నాయని ఈ సందర్భంగా అటవి శాఖ అధికారులు గుర్తు చేశారు.

వైభవంగా బౌద్ధ జ్ఞాన దీపావళి వేడుకలు.



ముమ్మిడివరం.నవంబర్ 9.ప్రభాతవార్త స్థానిక బుద్ధ పార్కు ఆవరణలోని బుద్ధుని విగ్రహం వద్ద ఆదివారం సాయంత్రం బౌద్ధ జ్ఞాన దీపావళి వేడుకలను బుద్దిస్ట్ సోదరులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు బౌద్ధ ఉపాసకులు బుద్ధ విగ్రహం మట్టూ దీపాలు వెలిగించి, బుద్ధ వందనం పఠించి మాట్లాడుతూ సిద్ధార్థుడు బోధి జ్ఞానాన్ని పొంది ధర్మబోధ చేస్తూ కపిలవస్తు పురానికి తిరిగి వచ్చిన సందర్భంలో ప్రజలు వరుస దీపాలు వెలిగించి ఘన స్వాగతం పలికిన చారిత్రక ఘట్టానికి గుర్తుగా బౌద్ధ జ్ఞాన దీపావళిని జరుపుకుంటున్నారు.ప్రజల్లో అజ్ఞానాంధకారాన్ని తొలగించి జ్ఞానం, కరుణ, సమానత్వం, శాంతి మార్గాన్ని బుద్ధుడు ప్రపంచానికి అందించారని,అలాంటి బుద్ధుని బోధనలు ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో పెనుమాల సుదీర్, దోనిపాటి ఆంజనేయులు, వడ్డీ నాగేశ్వర రావు, కుంచె చినబాబు, కాశి బాబు జగజీవన్ రామ్,కె సింహాద్రి వర్య,శరత్ లతో పాటు పలువురు బౌద్ధులు పాల్గొన్నారు.

తూర్పు, కాకినాడ జిల్లాల్లో కమలం వికాసం
-ఎంపీటీసీ ఎన్నికల్లో బీజేపీకి చారిత్రాత్మక విజయం



రాజమహేంద్రవరం అర్బన్, నవంబర్ 9, ప్రభాతవార్త,తూర్పుగోదావరి, కాకినాడ జిల్లాల్లో జరిగిన ఎంపీటీసీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ అభ్యర్థులు విజయాలు సాధించి పార్టీ బలోపేతానికి నాంది పలికారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంబాల శ్రీనివాసరావు తెలిపారు. కోరుకొండ, రాజానగరం మండలాల్లో పార్టీ అభ్యర్థులు 18 స్థానాల్లో విజయం సాధించడం శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపిందన్నారు.ఆదివారం రాజమహేంద్రవరంలోని మంజీరా హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కార్యకర్తల సమష్టి కృషి, ప్రజల ఆదరణతో ఈ విజయాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతాలు, హిందూ ధర్మ పరిరక్షణ, రామజన్మభూమి ఉద్యమ స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కార్యకర్తలు కీలక పాత్ర పోషించారన్నారు.గోకవరం మండలంలో బీజేపీ సాధించిన విజయాలు ప్రత్యేకమని, గోకవరం ఎంపీటీసీ-1 స్థానం నుంచి పార్టీ అభ్యర్థి దోసపాటి నాగ వెంకటేశ్ 595 ఓట్ల మెజార్టీతో గెలుపొందడం చారిత్రాత్మకమని అన్నారు.ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసి, కొత్తవారికి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. సమావేశంలో బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నార

తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం. డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక వార్త

గ్రామ పంచాయతీ ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి
-మూడు దశల్లో నవంబర్ 26, 29, డిసెంబర్ 2న పోలింగ్



రాజమహేంద్రవరం అర్బన్, నవంబర్ 9, ప్రభాతవార్త, తూర్పుగోదావరి జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడుతూ మూడు దశల్లో ఎన్నికల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతి మండలానికి జిల్లా స్థాయి అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించి సమన్వయంతో విధులు నిర్వహించాలని సూచించారు. నవంబర్ 26, 29, డిసెంబర్ 2 తేదీల్లో పోలింగ్ జరగనుండగా, ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్, అనంతరం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టనున్నట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 4,082 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఎన్నికల ప్రక్రియలో ఎక్కడా జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

నిబంధనలు తుంగలో తొక్కిన బాణాసంచా వ్యాపారులు
-సుప్రీంకోర్టు ఆదేశాల బేఖాతరు



యు.కొత్తపల్లి, నవంబర్ 9(ప్రభాతవార్త) :దీపావళి పండుగ సందర్భంగా మండలంలోని అనుమతులు పొందిన బాణసంచా వ్యాపారులు నిభంధనల పూర్తిగా తుంగలో తొక్కి సొమ్ములు చేసుకున్నారని కొనుగోలు దారులు మండిపడ్డారు. పోలీస్ స్టేషన్, తహసీల్దార్, వ్యవసాయ శాఖ